క్లుప్తంగా

క్షతగాత్రులకు సాయం



టి.నగరపాలెంలో క్షతగాత్రునికి సాయం అందిస్తున్న యువకులు

తగరపువలస: ఇటీవల పని ప్రదేశంలో మార్బుల్ షీట్లు పడి కాళ్లకు తీవ్రగాయాలైన భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన గారి సురేష్, పూసర్ల నర్సింహా అనే వ్యక్తులకు స్థానికులు శుక్రవారం సాయం అందించారు. వీరికి శివశంకర్ సహకారంతో నిత్యావసర సరుకులతో పాటు బియ్యం, రూ.2వేల నగదు అందించారు. వీటిని వాండ్రాసి సతీష్‌కుమార్, పూసర్ల రామారావు, బాయిన మంగరాజు చేతుల మీదుగా బాధితులకు అందించారు.

వెంకటాపురంలో చోరీ

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పీఎం పాలెం క్రైం సీఐ డి.రమేష్ అందించిన వివరాలివి.. వెంకటాపురం కర్రి వాని కళ్లాలకు చెందిన కర్రి పద్దన్న ఎర్రదుంపలు పండిస్తుంటారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంటన్నర సమయంలో ఆ ఎర్ర దుంపలను అమ్మడానికి ఆనందపురం మార్కెట్‌కు బయల్దేరి వెళ్లారు. మిగతా కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో దొంగలు ఇంట్లో ప్రవేశించి బీరువాలో ఉన్న పద్దన్న భార్య అప్పయ్యమ్మ బంగారపు పుస్తెల తాడు, తల్లి అప్పల నరసమ్మ బంగారపు తాడు దొంగిలించుకుపోయారు. దీనిపై కర్రి పద్దన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు



మాట్లాడుతున్న ముత్తంశెట్టి మహేష్

పద్మనాభం: పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ భీమునిపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గృహ సారథుల నియామకంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడే పని చేసే వారిని గృహ సారథులుగా నియమించాలని సూచించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, మొకర అప్పలనాయుడు, గాడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా భోగి మంట



భోగి మంట వేసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు భోగి మంటలు వేసి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం భోగి మంట వేసి స్టీల్ ప్లాంట్‌ను విక్రయించొద్దంటూ నినాదాలు చేశారు. నిరసనగా భోగి మంటలో ఒక్కో కట్టె వేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, పబ్లిక్ సెక్టార్ కో–ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె.ఎం.కుమార్ మంగళం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే బీజేపీ ప్రభుత్వానికి ప్రజా సంఘాలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మణి, సీతామహాలక్ష్మి, వెంకటరావు, జె.ఆర్.నాయుడు, శ్రీను, వరలక్ష్మి పాల్గొన్నారు.

అంతటా పండగ శోభ

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సమీపించడంతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. విద్యాసంస్థలు, పరిశ్రమల్లో ముందుగానే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇక సంక్రాంతి షాపింగ్‌తో మార్కెట్లన్నీ రద్దీగా మారాయి. బట్టల షాపులతో పాటు ఫ్లాట్‌ఫాంపై దుకాణాల వద్ద కూడా రష్ ఎక్కువగా ఉంటోంది. సంక్రాంతి పండగ సందర్భంగా పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి ముంగిళ్లన్నీ ముత్యాల ముగ్గులతో కళకళలాడుతున్నాయి. ఇక పోటీలు నిర్వహించే ప్రాంగణాలన్నీ అతివలు తీర్చిదిద్దిన రంగుల రంగవల్లికలతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి.



రద్దీగా తగరపువలస ప్రైవేట్ మార్కెట్



పార్కింగ్ ప్రదేశం లేక డివైడర్ పై పార్క్ చేసిన వాహన శ్రేణి

తగరపువలస: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్థానిక మార్కెట్ శుక్రవారం సందడిగా కనిపించింది. తగరపువలస కేంద్రంగా ఉన్న భీమిలి, పద్మనాభం, ఆనందపురం, మధురవాడ, పక్క జిల్లాలోని భోగాపురం, డెంకాడ మండలాలకు చెందిన వినియోగదారుల రాకతో రద్దీగా కనిపించింది. ఈ సందడి మరో రెండు రోజుల పాటు సంక్రాంతి వరకు కొనసాగనుంది. బట్టల దుకాణాలు, కూరగాయలు, కొత్త పాత్రలు, మసాలా దినుసులు, పూజా సామగ్రి, కిరాణా, రెడీమేడ్ వస్త్రాలు, చెప్పుల దుకాణాలు కిటకిటలాడాయి. మార్కెట్, రోడ్లు చుట్టుపక్కల వీధులన్నీ చిరువ్యాపారాలు, తోపుడు బండ్ల వర్తకులతో నిండిపోవడంతో వాహనాలను రాములమ్మ థియేటర్ నుంచి తాతా థియేటర్ వరకు డివైడర్‌పై పార్క్ చేసుకున్నారు. మార్కెట్ సందడిలో ఎలాంటి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా, దొంగతనాలు జరుగకుండా భీమిలి పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమానితులను ప్రశ్నించి హెచ్చరించి వదిలేశారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మధురవాడ: బక్కన్నపాలెం సాయిప్రియ గార్డెన్ రోడ్డులో మాతృశ్రీ చారిటబుల్ ట్రస్ట్, బిల్డర్స్ అండ్ శ్రీరామ బుద్ధ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ట్రస్ట్ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిన శివ, పోతిన వెంకట రామారావు తదితరులు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. భోగి మంటలు, కోడి పందాలతో పాటు పల్లె వాతావరణం ఉట్టి పడేలా ఎడ్ల బండి, చెరకు గెడలు, కుండలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పోతిన రాజు, కిరణ్, చిట్టిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చింపల్లి మణి ప్రథమ, జీరు లక్ష్మి ద్వితీయ, వాడమొదల వెంకట లక్ష్మి తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు శనివారం నిర్వహించే భోగి సంబరాలలో బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



సంక్రాంతి సంబరాలను పారంభిస్తున్న నాయకులు

కుంతీ మాధవస్వామి ఆలయం వద్ద..

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు వచ్చి ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, గాడు అప్పలరాజు, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ప్రత్యేక అలంకరణకు టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలను తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు.



ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు



శ్రీవారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

గృహ సారథుల పనితీరు పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

భీమునిపట్నం: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న గృహసారథులు బాధ్యతతో పని చేసేలా పర్యవేక్షించాలని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు అన్నారు. జోన్ పరిధిలోని నాలుగు వార్డుల పార్టీ కన్వీనర్లు, నాయకులతో గృహ సారథుల ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఆయా వార్డుల వలంటీర్లతో పాటు ఇద్దరు సారథులు ఉంటారని, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయా? అని పరిశీలిస్తారని చెప్పారు. పథకాలు కచ్చితంగా నిర్దేశించిన సమయానికి అందుతున్నాయో? లేదో? తెలుసుకుని, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి మేలు జరిగేలా చూస్తారన్నారు. ప్రభుత్వం ప్రతి ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు అందిస్తోందని, దీంతో అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్నో విధాలుగా కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని, అవేవి సీఎం జగన్ విజయంలో పని చేయవని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయం సాధించడం తథ్యమన్నారు. ఇందు కోసం పార్టీలోని ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే బాగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి గరివిడి వాసి



శీరపు లక్ష్మినారాయణను పెదవాల్తేరులోని రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించిన సురేష్‌రెడ్డి, పవన్

తగరపువలస: అంధుడైన 70 ఏళ్ల వృద్ధుడు శీరపు లక్ష్మీనారాయణ రెండు రోజులుగా చిట్టివలస సప్తగిరి థియేటర్ వద్ద రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు ఇచ్చింది తిని బయట చలిలోనే వణుకుతూ పడుకుంటున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆరాతీయగా.. తనది విజయనగరం జిల్లా గరివిడి అని, తమ అత్తవారిది తగరపువలస అని చెప్పాడు. భార్య పేరు రాధ, రెండో కుమారుడి పేరు కూర్మ అని ఆయన తెలియజేశాడు. మిగతా వివరాలు చెప్పలేకపోతున్నాడు. ఆయనకు వినిపించడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సంతపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలాపు సురేష్ రెడ్డి, కుమ్మరవీధికి చెందిన ఫార్మా ఉద్యోగి పొట్నూరు పవన్.. కారులో ఆయనను తీసుకొచ్చి పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించారు. వృద్ధుని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే సొసైటీలో సంప్రదించాలని సూచించారు.

మంచినీటి కుళాయిలు ప్రారంభం



కుళాయిలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలసలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులు, కుళాయిలను కార్పొరేటర్ కొండబాబు శుక్రవారం ప్రారంభించారు. ఏళ్ల తరబడి వేధిస్తున్న మంచినీటి సమస్య తీరడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ



తగరపువలస: చిట్టివలస పెట్రోల్ బంకు వద్ద శ్రీసంపత్ వినాయక మినీ గూడ్స్ వాహనాల డ్రైవర్లు, ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు నగదు, నిత్యావసర సరకులు అందజేశారు. ఆర్థికంగా చితికిపోయిన కార్మికులు, ఎవరూ లేని అభాగ్యులను గుర్తించి వీటిని అందించారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలు అందజేశారు.

సమర్థవంతంగా పారిశుధ్య పనుల నిర్వహణ



మారికవలస కాలనీలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: నివాస ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జీవీఎంసీ మధురవాడ జోన్–2 కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి సూచించారు. శుక్రవారం జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస, ఆర్‌జీకే కాలనీ పరిసర ప్రాంతాలలో ఆమె పర్యటించారు. పారిశుధ్య పనులు, క్లాప్ వాహనాలు ద్వారా చెత్త సేకరణ, తదితర అంశాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులకు ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రాజెక్టు, గ్యాస్ ప్లాంట్, చెత్త నిర్వహణ, చెత్త వాహనాలు తూకం తదితర అంశాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తత అవసరం



రేఖవానిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న భీమిలి క్రైం పోలీసులు

తగరపువలస: పండగ వేళ దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమిలి క్రైం ఎస్‌ఐ సూర్య ప్రకాష్ సూచించారు. ఈ అంశంపై ఎస్‌ఐ ఆధ్వర్యంలో సిబ్బంది ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపైకి వచ్చేటప్పుడు ఒంటిపై ధరించే ఆభరణాలను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. పండగకు సొంత ఊళ్లకు వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకుండా లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆగంతకులకు ఆశ్రయం ఇవ్వవద్దని హెచ్చరించారు.

గుడివాడ పంచాయతీకి దివీస్ వితరణ



గుడివాడ సర్పంచ్ జమునకు ఎల్ఈడీ దీపాలు అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీకి చెందిన దివీస్ లేబొరేటరీ ప్రతినిధులు శుక్రవారం గుడివాడ పంచాయతీకి రూ.45 వేలు విలువైన 25 ఎల్ఈడీ దీపాలు అందజేశారు. ఇటీవల గోస్తనీ నది వంతెనపై చీకట్లు కమ్ముకోవడంతో వీటిని అమర్చేందుకు అందించినట్టు దివీస్ ప్రతినిధి ఇ.ఎస్.నాగరాజు తెలిపారు. అంతే కాకుండా పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణకు రూ.20వేలు విలువైన 12 బస్తాల బ్లీచింగ్, 17 బస్తాల సున్నం అందజేశారు. ఈ కార్యక్రమంలో మరో ప్రతినిధి నరసింహారావు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఆంధ్రా బాడీ బిల్డర్లు

మిస్టర్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా రాజేష్



మిస్టర్ ఇండియా పోటీల్లో సత్తా చాటిన రాజేష్

అల్లిపురం: పశ్చిమబెంగాల్లో ఈ నెల 11,12 తేదీల్లో జరిగిన 57వ మిస్టర్ ఇండియా–2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొని తమ సత్తాచాటారు. దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 65 కేజీల విభాగంలో పోటీ పడ్డ రాజేష్ ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ రన్నరప్‌గా నిలిచి ఆంధ్రప్రదేశ్ కీర్తి, ఖ్యాతిని దేశం నలుమూలలా చాటారు. అలాగే 70 కేజీల కేటగిరీలో సంగడి రమేష్ ద్వితీయ స్థానం సాధించగా, 80 కేజీల విభాగంలో నార్ని శివదుర్గా అవినాష్ మూడో స్థానం సాధించారు. మాస్టర్ విభాగంలో కె.రామునాయుడు నాలుగో స్థానంలో సత్తా చాటారు. ఏపీ నుండి పాల్గొన్న వారందరూ టాప్ 10లో నిలిచారు. మిస్టర్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.గురునాథరావు, కోశాధికారి టి.రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వి.విజయకుమార్, జోగి కిరణ్, ఉపాధ్యక్షుడు బీపీ రెడ్డి, జి.విష్ణుమూర్తి అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల కోసం తప్పని నిరీక్షణ



సాయంకాలం చీకటి పడుతుండడంతో వడివడిగా హాస్టల్‌కు వస్తున్న విద్యార్థినులు



బోరవానిపాలెం సమీపంలోని డ్రైవర్స్ కాలనీ వద్ద గల కళాశాల బాలికల హాస్టల్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బోరవానిపాలెం సమీపంలోని డ్రైవర్స్ కాలనీ వద్ద హైవేపై ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కొద్ది నెలలు క్రితం రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ లక్షలాది రూపాయలు వెచ్చించి భవనం నిర్మాణం చేసి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించారు. ఇక్కడ రిక్వెస్ట్ బస్టాపు అని గతంలో ఆర్‌టీసీ అధికారులు ప్రకటించిన తర్వాత కూడా బస్సులు ఆపకపోవడంతో విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థులు ఎండనకా, వాన అనకా, ఉదయం, చీకటి పడిన తర్వాత కూడా మారికవలస లేదా బోరవానిపాలెంల వద్దకి వెళ్లి బస్సులు ఎక్కడం అక్కడే బస్సులు దిగి కిలో మీటరు వరకు నడచి హాస్టల్‌కి రావాల్సి వస్తోంది. 70 మంది బాలికలు ఇక్కడ ఉంటూ వివిధ కళాశాలలు, గ్రూపు ల్లో చదువుతూ ఉన్నారు. వీరు చదువులు నిమిత్తం ఇటు తగరపువలస, విశాఖపట్నం పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విద్యా సంస్థల్లో చదువు నిమిత్తం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా వరకు నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఒక్కొక్కరు వెళ్లి రాలేని పరిస్థితి. విషయం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. కనీసం ఉన్నతాధికారులు అయినా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయం నుంచి 'మేలుకొలుపు'



మేలుకొలుపు కోసం వస్తున్న ఆలయ ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి శుక్రవారం ఆలయకమిటీ ప్రతినిధులు మేలుకొలుపు నిర్వహించారు. విష్ణుమూర్తి ఫొటోను పట్టుకుని ఇంటింటా తిరుగుతూ దైవనామస్మరణ చేశారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా వేకువజామున ఇలా మేలుకొలుపులు పాడుతూ ప్రజలను ఆధ్యాత్మిక వాతావరణంలోకి తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా భక్తులు ఇచ్చే కానుకలను ఆలయాలకు ఇస్తుంటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు లక్ష్మణరావు, నాగేశ్వరరావు, వీర్రాజు, తవుడు, అప్పలరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా త్యాగరాజ కీర్తనలు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: త్యాగరాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన ఉత్సవాలలో మూడో రోజు శుక్రవారం త్యాగరాజ కృతువును శ్రావ్యంగా ఆలపించి అలరించారు. త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పంతులు గోపాలరావు, డాక్టర్ గుమ్ము లూరి రాంబాబులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకూ వరుసగా కచేరీలు కొనసాగాయి. వర్ధమాన కళాకారులు తమ గానంతో మైమరిపించారు. ఎనిమిది బృందాలు చిన్నారులు లయబద్ధంగా కృతులను ఆలపించి రంజిప చేశారు. ఏయూ సంగీత విభాగాధిపతి ఆచార్య ఎం.జలజాక్షి చక్కని గాత్రంతో పాటలు పాడారు. మండపాక శ్రీదేవి వీణానాదం అందరిని తన్మయపరిచింది. డాక్టర్ వెంపటి చినసత్యం కళాక్షేత్రం విద్యార్థిని చొప్పల సింధుజ త్యాగరాజ కృతులకు కూచిపూడి నృత్యంతో అబ్బురపరిచింది.

డీసీఎంఎస్ బీవోఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం విభాగంలో బీవోఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం గౌరవ గ్రంథాలయాధికారిగా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.